"మీ రెండో సందేహం?"

"నీడ అనేక చోట్ల ఉన్నా మీరు చెట్టునీడనే ఎందుకు ఆశ్రయించారు?"

"మీ ప్రశ్నలకి జవాబులు నాకు తెలీవు స్వామి. మీరే చెప్పండి." రంగాచారి అర్థించాడు.

"భగవంతుడు నిరాకారుడైనా అది గ్రహించలేని వారికోసం ఇంద్రియాల ద్వారా వ్యక్తం అవడానికి ఆకారం ధరించాడు. మామూలు నీడలో కన్నా చెట్టు నీడన ఎక్కువ చల్లదనం అనుభవించడం లాగానే, అలాంటి వారు తనని చూడటానికి అనువుగా భగవంతుడు గుళ్ళో విగ్రహంగా వెలుస్తాడు. ఎండు చేపల తయారీ కార్ఖానాలో చేపల వాసనే వస్తుంది. అత్తరు తయారు చేసే కార్ఖానాలో అత్తరు వాసనే వస్తుంది. అలాగే పవిత్ర దేవాలయ ప్రాంగణంలో భక్తి రసం నిండివుండి, మనసు తేలికగా దైవం మీదకి మళ్ళించే వాతావరణం కలిగి ఉంటుంది."

తనలోని అజ్ఞానాన్ని పారదోలిన ఆయనకి రంగాచారి సాష్టాంగ ప్రమాణం చేసి, ఆ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడమే కాకుండా, ధన సహాయాన్ని కూడా చేసాడు.

## 68. ఉపదేశానికి అర్హత

ఓ రాజుకి ఆధ్యాత్మిక జీవితం మీద ఆసక్తి కలిగింది. కాశీలోని ఓ గురువు దగ్గరకి వెళ్ళి తనని శిష్యుడిగా స్వీకరించమని కోరాడు.

"నువ్వు రాజువి. నేను సామాన్య మానవుడ్ని. కాబట్టి నిన్ను నేను శిష్యుడిగా స్వీకరించలేను." ఆ గురువు అందుకు ఒప్పుకోలేదు.

రాజు బతిమాలాడు. గురువు భార్యకి ఆ రాజు మీద జాలి కలిగి, ఆయన్ని శిష్యుడిగా స్వీకరించేందుకు తన భర్తని ఒప్పించింది. ఆ రాజుకి గురువు అంట్ల పాత్రలు తోమడం, ఇల్లు ఊడవడం లాంటి కనాకష్టమైన

పనులు చెప్పాడు. రాజు ఎదురు చెప్పలేదు. ఆరేళ్ళపాటు గురువు చెప్పిన అన్ని రకాల నికృష్టమైన పనులు చేస్తూ, గురువు నించి తనకి ఉపదేశం ఎప్పుడు లభిస్తుందా అని ఆత్రంగా ఎదురు చూడసాగాడు.

"రాజుగారు మన దగ్గరకి వచ్చి చాలా కాలం అయిందిగా. ఆయనకి ఆత్మ బోధ చేయండి." ఇది గమనించిన గురుపత్ని ఓ రోజు తన భర్తతో చెప్పింది.

గురువు అంగీకరించక పోతే భార్య బ్రతిమాలడంతో చెప్పాడు.

"సరే. రేపు ఇల్లు ఊడ్చిన చెత్తని పైనించి ఆయన మీద పడేసి చూడు. నీకే అర్థమవుతుంది."

మర్నాడు గురువు భార్య తన భర్త చెప్పినట్లు చేసింది. రాజు ఆమె వంక ఉగ్రంగా చూస్తూ అరిచాడు.

"ఇదే నా రాజ్యం అయివుంటే నీ తప్పుకి నా వాళ్ళు నిన్నేంచేసి ఉండేవారో తెలుసా?"

"విన్నావుగా? ఇంకా అతనిలో తను రాజుననే అహం చావలేదు. అహం చస్తే కాని ఎవరి మనసైనా పవిత్రం కాదు." గురువు తన భార్యతో నవ్వుతూ చెప్పాడు.

మరో ఆరేళ్ళు గడిచాయి. ఈ లోగా ఆమె తన భర్తకి రాజుకి ఆత్మబోధ చేయమని అనేకసార్లు చెప్పింది. ప్రతీ సారి గురువు 'ఇంకా సమయం ఉంది' అని జవాబిచ్చేవాడు. ఓ రోజు గురువు తన భార్యని పిలిచి చెప్పాడు.

"ఇప్పుడు నీ కోరిక తీరే సమయం వచ్చింది. రేపు రాజుకి మంత్రోపదేశం చేస్తాను."

"ఆరేళ్ళ క్రితం నా మీద రాజు అరచినప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. నాకతనిలో తేడా ఏం కనిపించడం లేదు." చెప్పింది గురుపత్ని.

"ఇదివరకటిలా రేపు చెత్తని అతని నెత్తి మీద అభిషేకించి చూడు. తేడా నీకే తెలుస్తుంది." చెప్పాడు గురువు.

మర్నాడు ఆమె ఇల్లు ఊడ్చిన చెత్తని తెచ్చి పైనించి రాజు నెత్తి మీద కుమ్మరించింది. రాజు వెంటనే ఆమెకి రెండు చేతులూ జోడించి చెప్పాడు.

"అమ్మా! నా పాడు మనసుకి ఇంకా అహం అన్న మలినం వదలనందుకు మంచి పనే చేసావు."

ఆ రోజు గురువు రాజుకి మంత్రోపదేశం చేస్తూ చెప్పాడు.

" మనసనే పాత్రలోని అహం సంపూర్ణంగా ఖాళీ అయితేనే కదా, అందులో కొత్తది ఏది నింపినా తేలిగ్గా పట్టేది."

## 69. నిజమైన ప్రార్థన

ఓ పరోపకారి అలుపు, సొలుపు లేకుండా ఇతరులకి సాధ్యమైనంత మేర సహాయం చేస్తూండేవాడు. ఓ సారి అతను ఎవరికో సహాయం చేసి తిరిగి ఇంటికి వెళ్తూంటే, అడవిలో ఓ అందమైన అమ్మాయి ఓ చోట కూర్చుని కనిపించింది. ఆమె తన చేతిలోని పుస్తకంలో ఏదో రాసుకుంటూండటం అతను చూసాడు.

"మీరెవరు? దాంట్లో ఏం రాస్తున్నారు?" ఆసక్తిగా అడిగాడతను.

"నేనో దేవదూతని. భగవంతుడి మీద అపారమైన ప్రేమ, భక్తి గలవారి పేర్లు ఇందులో వరసగా రాస్తున్నాను. నీ పేరు చెప్తే అది ఇందులో ఉందేమో చూస్తాను." అడిగిందామె.

"నా పేరు అందులో ఉండకపోవచ్చు. నేనెన్నడూ గుడికి వెళ్ళింది లేదు. దైవ ప్రార్థన కానీ, వ్రతాలు, ఉపవాసాలు కానీ చేసి ఎరగను." ముక్తసరిగా జవాబు చెప్పాడతను.

"నీ మొహం చూస్తూంటే మంచివాడివేనని నాకనిపిస్తోంది. నీ తీరిక